# క్లియోపాత్రా

ముద్దుకృష్ణ గారు

క్లియోపాత్రా ౨,౦౦౦ సం॥ల క్రితం ఈజిప్టు దేశపుమహారాజ్ఞి. ఎంతో సౌందర్యవతి, భోగి తీరని ప్రేమపిపాసి. ఈమె యౌవనం పుష్పించబోవుతూవున్న లేౌండరవయస్సులో ఇటలీదేశంనుంచి సీజరు దండెత్తి వచ్చినాడు, ఈజిప్టును స్వాధీనపరచుకోవలెనని. సీజరు మహాయోధుడు. రోమునుంచి సాధారణసేనానిగా బయలుదేరి అప్పుడు యూరపుఖండంలో జయించదగిన దేశాలను, గాలు, బ్రిటనులను (అనగా ఫ్రేన్సు, ఇంగ్లండులను) సంపూర్ణంగా స్వాధీనపరుచుకుని స్వదేశమన్ననకు పాత్రుడై ప్రజలు మూడుసార్లు కిరీటాన్ని పాదాలదగ్గర పెడితే వొద్దని నిరాకరించి మకుటంవినాచక్రవర్తిగా పాలించినాడు.

సీజరు క్లియోపాత్రామీద యుద్ధానికి వచ్చేప్పటికి అతనిజీవితంలో వసంతంమిసిమి తెల్లబారుతూ హేమంతాన్ని చేరుతూవుంది. ఇంత సీజరును, ఆపదహారేళ్లక్లియోపాత్రా, ప్రపంచాన్నంతా జయించిన ప్రతాపశాలిని, మేధాశక్తితో రోమును సామంతరాజ్యాలను ఎదిరింపు యెరగని తీవ్రతతో పాలిస్తూవున్న శక్తిమంతుణ్ణి, సీజరును, క్లియోపాత్రాముగ్ధ విప్పారుతూవున్నా యింకా స్వశక్తినైనాగ్రహించలేనియావనోద్రేకంలో వున్న క్లియోపాత్రా, బాలిక, ఒక్కచూపుతో, ఆసీజరును తనపాదాలదగ్గర కుక్కపిల్లనుగా చేసుకుని ఆసింహంతో చెలగాటలు ఆడుకున్నది. సీజరు, పాపం ఎంత చక్రవర్తియైనా ప్రకృతికి బద్ధుడేగా! పాపం జీవితభారం మోసుకుని అన్నీ గడచి సీతాకాలంవైపు కృశింపుదారి బడుతూ వున్న శరీరాన్ని మోసుకుపోతూ వున్నవాడికి క్లియోపాత్రావేడి మొదట హాయి మనిపించినది. వెనకకు తిరిగి తరలిపోయినఆమనిని త్రిప్పుకోవలెననే యత్నంతో బ్రతుకు మళ్లించేడు; కాని అనుని మేషాభివృద్ధి పొందుతూ వున్న క్లియోపాత్రా వేడికి ఆగలేకపోయినాడు. ఈప్రచండత్వానికి తాళలేక తరలిపోయాడు.

సీజరుగతించగానే మళ్లీ అంతశక్తితో అంత తీవ్రతతో ఆసామ్రాజ్యానికంతకూ చేయూతనిచ్చి పునః దిగ్విజయంచేసినాడు, ఏంటొనీ. ఏంటొనీమంచియౌవనం పొగరులో వున్నాడు. వీరరసంతో ప్రపంచాన్ని దిగ్భ్రమజేసి తన కీర్తి దిక్కుల పిక్కటిల్లజేశాడు. క్లియోపాత్రా పొగరుబోతుతనం ధిక్కారం అణచవలెనని బయలుదేరినాడు. అప్పటిప్రపంచంలో రెండే మహారాజ్యాలు రోము,ఈజిప్టు. అప్పుడు యిద్దరే ప్రపంచాతీతవ్యక్తులు రోమువీరుడు ఏంటొనీ, ఈజిప్టుమహారాజ్ఞి క్లియోపాత్రా. ఏంటొనీ ఈజిప్టుజయించడానికి బయలుదేరేడు. క్లియోపాత్రాకు చాలాపౌరుషంగా పరు

షంగా వార్తసంపేడు, "లొంగుతావా, లొంగ దీయమంటావా?" అని. నిరసనగా నిశితంగా జవాబుపంపినది. పరస్పరం కలుసుకుని ముఖాముఖిని సంధికియత్నించి సరిపడకపోతే యుద్ధం అనుకున్నారు.

ఏంటొనీ ఈజిప్టునుకూడా లొంగదీసి దాసిగాచేయగలడని అటునుంచి రోమూ సామంతరాజ్యాలూ వొరిగి చూస్తూన్నవి; తమ గౌరవాన్ని దేశాన్ని కాపాడుతుంది ఈమహాశక్తిని గెంటివేసి అని ఈజిప్టుసర్వప్రజా ఊపిరి ఆపి చూస్తూవున్నది.

ఏంటొనీ సేనలతో కొంతదూరం వచ్చి అక్కడ వేచివున్నాడు. క్లియోపాత్రా కొంత దూరం ఎదురువెళ్లినది. సేనలతో కాదు. తన సౌందర్యసర్వస్వంతోనూ, తనసమస్తవిలాసంతోనూ, చుక్కలవంటితన చేటికలతోనూ. సస్యశ్యామల ఫలప్రద రత్నగర్భఅయిన ఈజిప్టు తన అమూల్యాన్నంతా ఆమె అలంకారములకు వెచ్చించివేసినది ఆదినం. ఏంటొనీ, నాగరకప్రపంచాని కంతకూ నడకలు నేర్పుతూవున్న రోములోని మేలినసౌందర్యాలను కాంచినవాడే. కాని ఈమెరుపు చూసి సొలసిపోయాడు.

ఒక్క కనురెప్ప. ప్రపంచం మారిపోయినది.

ఈజిప్టు రోము పాదాలక్రింద సింహాసనములు.

క్లియోపాత్రా, చండశాసనురాలు మహారాజ్ఞి; ఏంటొనీ,వీరాధివీరుడు చక్రవర్తి, కారు, క్లియోపాత్రా సౌందర్యసర్వస్వాన్ని ఒడిగట్టుకునివచ్చిన మహావిలాసిని. ఏంటొనీ ఒడలునీరుగా మూగవడి మైమరచిన అమోమయం.

ఒక్కత్రుటి.

అటు రోమూసామంతరాజ్యాలూ చూస్తూనేవున్నవి. ఇటు ఈజిప్టు యింకా ఆతురతతోనే వున్నది.

ఏంటొనీ క్లియోపాత్రాను వొళ్లంతా కళ్లుచేసుకుని మూర్ఛతో చూశాడు.

క్లియోపాత్రా వొళ్లంతా సౌందర్యం తెరుచుకుని ఆతన్ని మాయగాకప్పివేసి తానూ తెలిసికోవడంలేదు.

ఒక్కత్రుటిలో, ప్రపంచం అంతా మారిపోయినది. ఏంటొనీ ఏమీతెలియక అన్నాడు "నీయంత సౌందర్యాన్ని చూడలే!" అని.

"ఏమిటీ! ఏంటొనీ ఇంత మెచ్చుకుంటాడా" అన్నది క్లియోపాత్రా.

యుద్ధసన్నద్ధమైన ఆప్రపంచం అంతా మారిపోయినది: పుష్పశయ్యగా ఆప్రేయసీప్రియులకు.

ఆవీరాధివీరుడు ఆబాహులతలలో సొమ్మసిల్లిపోయినాడు. ఆవిలాసిని అతనిజీవితంవెన్నెలగా విరిసినది. సంజమబ్బుల రంగులకన్నా తొందరగా వింతవింతగా మారిపోయే క్లియో

పాత్రాచిత్తవృత్తులను అనునిమేషం ఆనందంతో విలోకించడం, వాటిని అనుకూలంగా అనుసరిస్తూవుండడం ఏంటోనీ పని.

రెండుమహారాజ్యాలనూ తమ ప్రేమ కోరిన కోర్కెలకు సాధనసామగ్రిగా వాడుకున్నారు. రెండురాజ్యాలలోనూవున్న విలువనంతా కొల్లగొట్టి తమసయ్యాటలకు ఖర్చుపెట్టేరు. రోమూ, ఈజిప్టూ తహతహలాడిపోయినవి ఈవాళ్లు తెలియని ప్రేమకై పెక్కైన ప్రియులసేవ చేయలేక.

వీరి ఎడతెగనికౌగిలింతలలో నలిగిపోయినవి ఈమహారాజ్యాలు రెండూ.

వీరి ఆనందానికి చేసేసేవలో ఏకొద్దిలోపంకలిగినా కోపాగ్నికితహతహలాడిపోయినవి.

ఈ ఊపిరిసలపని ఆనందాలలో ఆటలలో ఆర్భాటలలో అలసిపోయినవి. వీరి కౌగిలింతలలో నలిగిపోయినవి. వీరి అకారణకోపాలకు తహతహలాడిపోయినవి. రెండు రాజ్యాలూ కుములుకుని బాధపడడం ప్రారంభించినవి.

ఇది అదనని ఆక్టేవియానసు ఎంచుకున్నాడు. ఏంటోనీ నిస్సత్తువగా ఉన్నప్పుడే దండెత్తి రెండురాజ్యాలను స్వాధీనంచేసుకుని ఏకఛత్రాధిపత్యం సాగించవలెనని. తగినసమయం చూసుకుని మహాసైన్యాన్ని గొప్పనౌకాదళాన్ని కూర్చుకుని ఈజిప్టుదండయాత్రకు బయలుదేరేడు.

వేగులు ఏంటోనీకి ఈ వార్త తెలిపినారు. ప్రేమపొంగిస్తూ వున్నారక్తంలోనికి రంయిమని ప్రాతవీరరక్తం ప్రవహించినది. శరీరమంతా నెత్తురుజిమ్మే కెంపులు చెక్కినట్లున్నది. కెంపెక్కిన నేత్రాలతో దిశలంటా సింహావలోకనం చేసి ' ఈజిప్టు, లే యుద్ధానికి ' అన్నాడు.

ప్రేమతో మెత్తనతో తన్నువలయించుకుంటున్న ఏంటోనీనేకాని ఈరుద్రమూర్తిని ఈప్రచండాన్ని చూడలే క్లియోపాత్రా ఇంతవరకు. నిండుగర్వంతో అచ్చుపడేటట్టు చూసుకుంది ఆఏంటోనీని, ఈవీరమూర్తినిజస్వరూపం ఆజిలో తిలకించవలెనని అభిలాష పుట్టినది. "సరే"అన్నది. ఈజిప్టు యావత్సైన్యం, నౌకాదళం, ఏంటోనీ మహాసైన్యం, ఆరితేరి నూరేసి యుద్ధాలు గెలిచిన అతిరథులతో ఏంటోనీ క్లియోపాత్రాలు ఆక్టేవియానసుకు ఎదురు వెళ్లేరు.

యుద్ధం ప్రారంభమైనది. ఏంటోనీ వెయ్యికళ్లతో చూస్తున్నాడు. ఆప్రాతవీరుడికి తెలుసు తానువిజృంభించేసమయం ఎప్పుడువొచ్చేది. అదనుకోసం వేచిఉన్నాడు. రక్తం వేడిమెక్కుతూవుంది. క్లియోపాత్రా ఓడదగ్గరగానే వుంది. ఆమె అంతా విలాసంగా చూడబోతూవున్నది.

ఇంతలో విధిలో ఏదో సుడిపుట్టినది. గభీమని క్లియోపాత్రా ఓడను మళ్లించి పారిపోతూంది. ఏంటోనీ ఓడకూడా తిరిగిపోయినది. క్లియోపాత్రా వెంటనే పోతూవుంది. ఏంటోనీ ఒక్కడే నిలవగల సమర్థుడే! ఆలోచనలేదు. క్లియోపాత్రా వెళ్లిపోతూవుంది. ఏంటోనీ వెళ్లిపోతూవున్నాడు. క్లియోపాత్రా చుక్కాను. ఏంటోనీ ఓడ.

ఒకదానివెనుక ఒకటి ఆ రెండు ఓడలూ యింటిదారిపట్టగానే ఆక్టేవియానసు విజృంభించాడు. నౌకాదళాన్ని తుత్తునియలు చేశాడు. ఇక ఎలక్జాండ్రియాను ముట్టడించినాడు. క్లియోపాత్రా ఖంగారుగా కోటలోనికి పారిపోయి ద్వారాలు మూయించివేసినది. ఏంటోనీ వేరే క్లియోపాత్రాభవనంలోనికి వెళ్లిపోయాడు. దెబ్బతినినసింహం. ఓ రక్తంచిందిపోతూవున్నది. పరాభవం. జీవితంలో యిన్నివందలయుద్ధాలలోనూ యెన్నడూ ఎరగనిది. క్లియోపాత్రా రహస్యంగా ఆక్టేవియానసుతో సంధిచేసుకుని పారిపోయినదని మండిపోతున్నాడు. రగులుతున్న తీవ్రాగ్ని దగ్గర రాలేరు యెవ్వరూ.

క్లియోపాత్రాకు ఏమీ తోచలేదు. భయంకరంగా వున్నది అంతా. ఏంటోనీకి ఏమని కబురు? ఎలాక్షమించుతాడు? ఏమీ తోచలేదు. 'విషంతిని చచ్చిపోయినది' అని కబురుచేప్పినది. ఈవార్త చెవులబడినది. ఊరికే అటూయిటూ పచారుచేస్తున్నవాడు స్తంభంలా నిలబడిపోయాడు. "క్లియోపాత్రా చచ్చిపోయినదా! ఇంక ఏంటోనీకి ప్రపంచంలేదు. ప్రపంచంలో వున్న ప్రేమా సౌందర్యమూ అన్నీ నశించిపోయినవి. ఐరాస్, నిన్ను ఒక బీదకుటుంబంలోనుంచి తీసి యింతస్థితికి తీసుకునివొచ్చేను. నీవు నీప్రభువుసేవజేసేసమయం వచ్చినది. నీకత్తితీసి నన్ను పొడిచివేయి," అన్నాడు. ఏంటోనీ దృఢసంకల్పం యెరుగును ఐరాస్. కత్తిదూసి తన్ను తానే పొడుచుకున్నాడు. "భలేనౌఖరువు, గొప్పవిశ్వాసం చూపించినావు, నాకు దారిచూపినావు" అని కత్తితీసి గుండెల్లో పొడుచుకుని పడిపోయినాడు. భూమి దద్దరిల్లినది.

క్లియోపాత్రాకు వెంటనే వార్త తెలిసినది. గొల్లుమని ఒక్కటే యేడ్పు. మృత్యువుదరి జేరుతూవున్న ఏంటోనీని తనకోటలోనికి రప్పించుకున్నది. ఈమరణం ఆయేడుపు చూస్తూవున్న ప్రపంచంఅంతా కొయ్యబారి కారిపోతూవున్న కన్నీళ్లు తుడుచుకుంటూవున్నది. ఏంటోనీ అన్నాడు, "ఏడుపుయెందుకు; ఇటురా, పక్కను పడుకో" అని. తొలిసమావేశంలో కలుసుకున్నట్టు అన్నీ మరిచిపోయారు. ఓ ముద్దులు, ఆలింగనములు, ఆరక్తప్రవాహంలో. వాళ్లు మరిచిపోయి చిన్నపిల్లలవలె ఏవో అర్థంలేని మాటలన్నీ చెప్పుకున్నారు. కాలం భూతభవిష్యత్తులు ముడుచుకొని అక్కడ ఒక్క వర్తమానంగా నిలిచిపోయినది. ప్రాతసంగతులుఅన్నీ చెప్పుకుంటున్నారు. ఓ వాళ్లుమరిచిపోతున్నారు. ఆపొంగులో, ఆవొడలు తెలియని ప్రేమలో ఏంటోనీ శిరస్సు క్లియోపాత్రా వొడిలో జారి నిద్రించాడు స్థిరంగా. బ్రహ్మాండంగుండె బ్రద్దలయ్యేటట్టు యేడ్చివేశినది. హఠాత్తుగా ఆపుకున్నది. ఒక్కచిటికలో సునాయాసంగా ప్రాణం హరించేవిషాన్ని తీసుకురమ్మన్నది.

తొలినాడు ఏంటోనీని చూడడానికివెళ్లిననాటి దుస్తులు అలంకారములు అన్నీతీయించినది. మహావైభవంగా తొలిసమావేశం అంత ఆడంబరంగా అలంకరించుకున్నది.

అద్దంలో చూసుకుని, ఆయపూర్వశోభ ఎక్కడినుంచి వచ్చినదా తనవదనంలోనికి అని హాశ్చర్యపడినది. తనసౌందర్యానికి తాను యెన్నడూ గర్వపడనట్టు గర్వించినది. ఆసౌందర్యార్చనలో ఒకత్రుటి సర్వం మరిచిపోయినది. ఓ కన్నులుపెద్దజేసుకుంటూ ఎప్పుడూ తిలకించని క్రొత్తకాంతిలో తన్ను తాను చూసుకుంటూవున్నది. ఇంతలో అంతాజ్ఞాపకం వచ్చినది. "ఏంటొనీ, వొస్తున్నా!" అని విషంత్రాగి ఏంటొనీ కౌగిలిలోనికి వొరిగిపోయినది.

సశరీరులై వున్నప్పుడు ఎన్నడూ యెరగని, అణువుఅణువ్రా ఆలింగనంలో సజీవకణాలుగా ఒక్క-శరీరంగా మట్టికౌగిలిలో ఒకరినొకరు అతుక్కొని పోయినారు. భూమి పులకరిస్తూ గర్వంగా అందుకున్నది వాళ్లని. ఆప్రేమ తలుచుకున్నప్పుడల్లాభూమి పువ్వులు పులకరిస్తూవుంటుంది, ఆయపూర్వప్రేమ సౌరభం ప్రపంచం గుండెలు తాకడమునకు.

---

## మా వ్యాసకర్తలకు

వ్యాసములు సంపూర్ణముగ చిన్నసైజు కాగితములపై ఒకవైపున మాత్రమే విడిఅక్షరములతో బంతులు దూరదూరముగా, దిద్దుబాట్లు లేకుండ, తిన్నగా వ్రాసి, వర్ణక్రమమునను తప్పులు లేకుండ చూచుకొని పంప వేడికోలు. లేకున్న ముద్రణకార్యములయందు మిగుల కష్టము కలుగుటయే కాక తప్పులుకూడ నిలిచిపోవునని మనవి. ప్రకటింపనివ్యాసముల తమకు తిప్పిపంపుటకయితపాలుబిళ్లలు పంపవలయును.

సంపాదకుడు, 'భారతి'